

అధికారంలోకొస్తే 'ఉక్కు' పరిశ్రమ

- ముస్లింలకు అండగా ఉంటాం
- ఎంపీగా అవినాష్‌రెడ్డి ఏమిచేశారో ప్రజలకు చెప్పాలి
- బాబాయ్ హత్యపై జగన్ మౌనం ఎందుకు?
- రెండో రోజు బస్సుయాత్రలో వైఎస్.షర్మిల

ప్రజాశక్తి-కడప

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కడపలో ఉక్కు పరిశ్రమను పూర్తి చేస్తామనిపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. శనివారం వైఎస్ఆర్ జిల్లా కడప నియోజవకర్గంలో రెండో రోజు బస్సుయాత్ర నిర్వహించారు. పెద్దదర్గా, దేవునికడప, సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బస్సుయాత్ర సందర్భంగా షర్మిల మాట్లాడుతూ టిడిపి, వైసిపి పాలనలో కడప స్టీల్ ఫ్యాక్టరీ శంకుస్థాపనలకే పరిమితమైపోయిందన్నారు. టిడిపి ఒకసారి, వైసిపి రెండు సార్లు శంకుస్థాపలు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. కడప ఎంపీగా ఉన్న వైఎస్.అవినాష్‌రెడ్డి పార్లమెంట్‌లో ఒక్క రోజు కూడాకడప ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడలేదన్నారు. తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఉండి ఉంటే ఎప్పుడో ఉక్కు పరిశ్రమ వచ్చేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటను ఉక్కు పరిశ్రమను నిర్మించి తీరుతామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కూడా తీసుకొస్తామని తెలిపారు. ముస్లింలను, ప్రజలను ఆదరించి వారికి అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. బిజెపి ముస్లింలకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. అయినా కూడా వైసిపి, టిడిపి పార్టీలు రెండు కూడా బిజెపితో రహస్య ఒప్పందం చేసుకొని బానిసలుగా మారి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయని విమర్శించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే రాష్ట్రం విడిపోయేది కాదన్నారు. ఎంపీగా వైఎస్.అవినాష్‌రెడ్డి జిల్లా ప్రజలకు, జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా ప్రజలకు అవినాష్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. వివేకనందరెడ్డి హత్య నిందితుడికే మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ఎంపీ టికెట్ ఇచ్చాడన్నారు. బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్‌రెడ్డిని సిబిఐ నిందితుడిగా తేల్చిందన్నారు. బాబాయ్ హత్య విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉండారో సమాధానం చెప్పాలన్నారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహించే వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మా నాన్న రాజశేఖర్‌రెడ్డి ముస్లింలను ఎంతగానో ప్రేమించే వారన్నారు. వారికి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని విధాలుగా సహాయం చేశారన్నారు. ముస్లిం పిల్లలు పెద్ద చదువులు, విదేశీ చదువులు చదువుకునేందుకు వీలు కల్పించారన్నారు. ముస్లింలకు ఎన్నో వాగ్ధానాలు ఇచ్చిన జగన్ ఒక్కటి కూడా నెరవేర్చలేదని తెలిపారు. కడప ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నానని చెప్పారు. నన్ను ఆదరించండి, ఆశీర్వదించండని తెలిపారు. కడప ఎంపీగా గెలిపించండి మీకు ఎప్పుడు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, నగర అధ్యక్షులు విష్ణుప్రీతంరెడ్డి, ప్రొద్దుటూరు పూల నజీర్, పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, అమర్, ఉత్తన్న, రామకృష్ణ, రాజబాబు, గాజుల భాస్కర్, లీలా శ్రీనివాస్, మైదుకూరు రఫిక్, పులివెందుల వేలూరు శ్రీనివాసరెడ్డి, కోటపాటి లక్ష్మయ్య, మధురెడ్డి, చెప్పలి పుల్లయ్య, పాలగిరి శివ, ధ్రువకుమార్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీఖాన్, మహిళా నాయకులు సుజాతరెడ్డి, గోసాల దేవి, లావణ్య, శ్యామలాదేవి, సిపిఐ నాయకులు చంద్ర పాల్గొన్నారు.


బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న వై.ఎస్. షర్మిల


పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న షర్మిల


వైవీస్ట్రీట్‌లో దుకాణాలను పరిశీలిస్తున్న జడ్జి

చిన్నారులతో పనిచేయించడం నేరం

ప్రజాశక్తి-కడప

షాపు యజమానులు చిన్న పిల్లలతో పనిచేయించుకోవడం చట్ట రీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుదీన్ పేర్కొన్నారు. శనివారం వైవీస్ట్రీట్‌లో ఉన్న దుకాణాలను లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణ యజమానులు వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని షాపులలో పని చేయించుకోవాలన్నారు. ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎమ్. శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ ఎం పాల్ జాన్సన్, జి శ్రీనివాసరెడ్డి, కె మునుస్వామి, దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్మలాదేవి, షాపు యజమానులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న కౌండిన్య

బ్రౌన్ గ్రంథాలయానికి 680 పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

విజయవాడలోని విద్యాధర పురంలో ఉండే సీనియర్ పాత్రికేయులు వేలూరి కౌండిన్య, తన కుమారుడు కృష్ణశాస్త్రి, కోడలు అనూషలతో కలసి శనివారం తన స్వగృహంలోని 680 పుస్తకాలను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ వేలూరి కౌండిన్య బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో వేటూరి పాట, పెద్దిబొట్ల సుబ్బరామయ్య నవలలు, నవ్య నీరాజనం, కూచిపూడి భాగవతుల చరిత్ర, శ్రీపాద చిన్నకథలు, విస్మృత కథ (కథా సంకలనం), బెజవాడ చరిత్ర, కథానిక స్వరూప స్వభావాలు, ఆలాపన (వ్యాససంకలనం), ఆర్.ఎస్.సుదర్శనం జీవన రేఖలు, వేయిపడగలు–సమకాలీనత–సార్వజనీనత తదితర గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన వేలూరి కౌండిన్యను యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక హర్షం వ్యక్తం చేశారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

కడప అర్బన్ : ప్రజలను రెచ్చగొట్టేలా సోషియల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సిఐ ఇబ్రహీం పేర్కొన్నారు. అల్మాస్ పేట లోని తాలీమ్ మసీదు వద్ద మూడు రోజుల కిందట జరిగిన గొడవ నేపథ్యంలో హెచ్చరించారు. కొంతమంది వ్యక్తులు అదే పనిగా ఫేస్ బుక్, వాట్స్ అప్ గ్రూప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికలపై రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం తగదని చెప్పారు. రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా, గొడవలు సృష్టించాలని చూసినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని వాట్స్ ఆప్ గ్రూపులు, సోషియల్ మీడియా పై ప్రత్యేక నిఘా పెట్టామని పేర్కొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

ప్రజాశక్తి - కడప

నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల(స్వయంప్రతిపత్తి)లో కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఆరు రోజులుగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ప్రధాన అతిథిగా హాజరైన కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అధ్యాపకులకు సూచనలు అందిస్తూ, విద్యార్థులంతా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొని, పోటీ ప్రపంచంలో కొత్త అవకాశాలను పొందేలాగా బోధనలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు చేరేలా బోధనా చేయాలని అన్నారు. సమావేశానికి కళాశాల ప్రధానాచార్యులు డా.జి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి కో–ఆర్డినేటర్‌గా తెలుగు శాఖాధిపతి సుందరేశ్వర రావు, బోధనాంశ నిపుణులుగా ఐ.నాగేశ్వర రెడ్డి, గుర్రప్ప (చరిత్ర), జి.చెంచు బాబు (రాజనీతి శాస్త్రం) వ్యవహరించారు. సాంకేతిక సహాయకులుగా జెకెసి మెంటార్లు సారధి, మంజుల, విశ్వనాథ నాయక్ వ్యవహరించారు.

'మున్నేళ్లి'లో తాగునీటి కష్టాలు

- ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని గ్రామస్తుల విన్నపం

ప్రజాశక్తి - బి. కోడూరు

మండలంలోని మున్నేళ్లి గ్రామంలో తాగునీటి కష్టాలు అధికమయ్యాయి. ఉన్న రెండు బోర్లలో భూగర్బ జలాలు అడుగంటిపోవడంతో చుక్కనీరు కన్పించని పరిస్థితి ఏర్పడింది. వచ్చే అరొకర నీరు కూడా సక్రమంగా రావడం లేదు. ఎప్పుడో 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పైప్‌లైన్లలో పాచి పట్టడం, గుడ్డలు పేరుకుపోవడంతో నీటి ప్రవా హానికి అడ్డుపడుతున్నాయి. దీంతో పైప్ లైన్లు కూడా పాడైపో యాయి. గ్రామం లోని జమ్మి చెట్టు జంక్షన్, బిసి కాలనీ బోరింగ్ జంక్షన్ వద్ద పూర్తిగా నీటి వాల్ పాడై సరఫరా కావడం లేదు. కుళాయిల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. ఎస్‌సి కాలనీలోని డ్రైయినేజీ నీటితో కుళాయి నీరు కలుషితమవుతోంది. పైప్‌లైన్లు బాగు చేయించాలని స్థానికులు ఎంపిడిఒ, పంచాయతీ అధికారులకు తెలి యజేసినా పట్టించుకోవడం లేదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవరకైనా అధికారులు కనీసం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఇరిగిన తాగునీటి కుళాయి

నేడు గంగమ్మ జాతర

ప్రజాశక్తి-చెన్నూరు

మండల కేంద్రమైన చెన్నూరు బస్టాండ్ సమీపంలో పీర్ల సావిడి వద్ద వెలసిన గంగమ్మ జాతరను ఆదివారం నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం నుంచి గంగమ్మ, పెద్దమ్మ అమ్మవార్లను ప్రతిష్టించి దారి పొడవునా చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. జాతర జరుగుతున్న ప్రాంతాన్ని సిఐ పార్థసారథి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి నుంచి జాతర మహోత్సవం మొదలవుతుంది. గొల్ల పుల్లయ్య గారి వీధిలో గంగమ్మ పెద్దమ్మ మట్టి విగ్రహాలను కుమ్మర్ల చేత తయారు చేయించి అక్కడ ప్రత్యేక అలంకరణ చేశారు. కమిటీ సభ్యులు చెన్నూరు సర్పంచ్. వెంకటసుబ్బయ్య(కళ్యాణ్) ముదిరెడ్డి సుబ్బారెడ్డి. శివారెడ్డి. యోగేశ్వర్ రెడ్డి. రమేష్. డీలర్ శ్రీనివాసులు. జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. గంగమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా చెన్నూరు కొత్త రోడ్డు దగ్గరలోని ఆసనం వద్ద ఆదివారం ఉదయం 8 గంటల నుంచి న్యూ కేటగిరి వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మరో కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 40 వేలు, రెండవ బహుమతి రూ. 30 వేలు, మూడో బహుమతి రూ. 20 వేలు, నాలుగో బహుమతి రూ. 10 వేలు, ఐదవ బహుమతి రూ. 5 వేలుగా నిర్వహించారు. పోటీలలో పాల్గొ దలచినవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

రాచాయిపేటలో ప్రజాదీవెన

గోపవరం : మండలంలోని రాచయపేటలో ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణ రెడ్డి శనివారం ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా కలిసి వారి అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థి సుధా, ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లికార్జున్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సిద్దు వెంకట సుబ్బారెడ్డి, సింగల్ విండో చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, గాజులపల్లి హరికృష్ణ రెడ్డి, సర్పంచ్ నాగేంద్ర, శ్రీనాథ్, రమణారెడ్డి, జెసిసి కన్వీనర్ పుల్లయ్య, సాంబశివారెడ్డి, రవి చంద్రారెడ్డి, మల్లీ, తిరుపాలు, వెంకటేష్, సుందర్ రామిరెడ్డి, మహేష్, నాయకులు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు 'పెన్నమ్మ' పరుగులు

ప్రజాశక్తి-చెన్నూరు

కడప నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గండికోట, మైలవరం జలాశయం నుంచి పెన్నా నది ద్వారా నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే పెన్నాపై నిర్మించిన ఆది నిమ్మాయిపల్లి ఆనకట్ట వద్ద చేరుకుంది. అక్కడ నుంచి కడప కెసి కెనాల్ మెయిన్ కాల్వ ద్వారా వీటిని వదిలారు. కడప నగరానికి దాహార్తి కోసం వాటర్ గండి వద్ద ఏర్పాటు చేసిన పంపింగ్ స్కీం వరకు నీరు చేరాయి. పెన్నా నది ద్వారా సిద్ధవటం మండలం లింగంపల్లి వద్ద నిర్మించిన వాటర్ గండి పంపింగ్ స్కీం వరకు నీరు పరుగులు పెడుతుంది. వారం రోజుల నుంచి ఆది నిమ్మాయపల్లి ఆనకట్ట నుంచి నీటి సరఫరా అవుతోంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కడప నగర వాసుల దాహార్తి తీర్చడానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆది నిమ్మాయపల్లె ఆనకట్ట కెసి కెనాల్ అధికారులు పర్యవేక్షణలో నీటి సరఫరా జరుగుతుంది. ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట నుంచి కెసి కెనాల్ వంకల ద్వారా సరఫరా అవుతున్న నీటిని ఎవరూ అక్రమంగా వాడుకోకుండా ప్రత్యేక నిఘా పెట్టారు. ఆదినిమాయపల్లి ఆనకట్ట కెనాల్ ఇంజినీరింగ్ అధికారి జమాలవల్లి మాట్లాడుతూ మైలవరం జలాశయం నుంచి 140 నుంచి 160 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేశారన్నారు. నీటిని కెసి కెనాల్ కాల్వ ద్వారా వంకలకు విడుదల చేస్తున్నామని తెలిపారు. అక్కడ నుంచి కడప వాటర్ గండి, లింగంపల్లి వాటర్ గండి వరకు చేరుకుంటుందన్నారు.

పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు ఏర్పాటు చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిటెండ్ నాగ మునిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని అవ యవాలలో కళ్లు ప్రధానమైనవని చెప్పారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకోవడం అభినందనీయమని చెప్పారు. డాక్టర్ల సలహా మేరకు తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కోశాధికారి నగేష్, ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ వేసవిలో ఎండలు, వడగా ల్పులు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుష్పగిరి ఆసుపత్రి సమన్వయకర్త అమరనాథ్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ మనోజ్‌కుమార్, సిబ్బంది వెంకటేష్, శ్రావణి, నిఖిత, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మైనార్టీలపై వైసిపి దాడులు తగవు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి విమర్శించారు. శనివారం మయూర గార్డినియాలో కడప పార్లమెంట్ టిడిపి, జనసేన, బిజెపి నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పార్టీల కలయికతో రాష్ట్రంలో అధికారం చేపడతామని పేర్కొన్నారు. పెన్షన్లు దేశంలో అన్ని రాష్ట్రాల్లో పంచుతున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో మాత్రమే వాలంటీర్ల ద్వారా ఇస్తున్నారని చెప్పారు. వైసిపి పెన్షన్ ఇవ్వకపోతే టిడిపి అధికారంలోకి రాగానే రూ.4వేలతో అందరికీ పెన్షన్ ఇస్తామన్నారు. ఖజానాలో డబ్బులు లేని కారణంగా ఒకటవతేదీ పెన్షన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. పెన్షన్లు విధానం పెట్టింది ఎన్‌టిఆర్ అని గుర్తు చేశారు. ఐదేళ్ల పాలనలో వైసిపి అన్నిరంగాల్లో విఫలమైందని తెలిపారు. బిజెపి నాయకులు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రూ.31వేల కోట్లుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో రోడ్లు వేయిందని చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీతో అభివృద్ధి జరిగిందన్నారు. చిన్నానను చంపిన వ్యక్తికి సిఎం జగన్ టికెట్ ఇవ్వడాన్ని సొంత చెల్లెళ్లు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి కడప ఎంఎల్‌ఎ అభ్యర్థి మాధవి, ప్రొద్దుటూరు ఎంఎల్‌ఎ వరదరాజులరెడ్డి, కమలాపురం ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి, బిజెపి అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-కాశినాయన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న, రాజన్న పాలన రావాలన్నా అది ఒక్క పిసిసి అధ్యక్షులు షర్మిల, కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బద్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన షర్మిల బస్సు యాత్రను విజయవంతం చేసిన బద్వేలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 8 నుంచి తాను కాంగ్రెస్ అభ్యర్థిగా గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేయనున్నాని, ప్రతి కార్యకర్త ఆదరించి సహకరించాలని ఆమె కోరారు. బస్సుయాత్రలో భాగంగా షర్మిల, సునత మాటలను స్థానిక ఎమ్మెల్యే, ఎమెల్సీ వక్రీకరించి మాట్లాడుతున్నారని ఆమె పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.


మాట్లాడుతున్న విజయజ్యోతి

హత్య కేసులో నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

పెండ్లిమర్రి మండలం, చిన్న దాస రిపల్లెలో భూ సమస్య విషయంలో ఈ నెల 2న చోటు చేసు కున్న శ్రీని వాసులు హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని కడప డిఎస్‌పి షరీఫ్ అన్నారు. శనివారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేసులో మరి కొంత మందిని పట్టుకోవాల్సి ఉందని తెలిపారు. నిందితులను కాశీనాయన గుట్టవద్ద విఆర్ఒ, విఆర్ఎ సమక్షంలో పోలీసులు అరెస్టు చేశారని పేర్కొన్నారు. వీరిని కోర్టు హాజరు పరుస్తున్నామని చెప్పారు. అరెస్టు అయిన వారిలో నాగిరెడ్డి ఉరఫ్ జగన్‌మోహన్‌రెడ్డి, సి.నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, చిన్న నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి ఉన్నారని తెలిపారు. ఎ1 నిందితుని టీ షర్టు, వారి నుంచి 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న సిఐలు కంబగిరి రాముడు, కె.నాగరాజును ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ అభినందించారని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి షరీఫ్

ఫాతిమా కళాశాలలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఫాతిమా వైద్య కళాశాలలో, ఆసుప్రతిలో ఇఫ్తార్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని చెప్పారు. ప్రతి ముస్లిం ఉపవాసదీక్షలు నిర్వహించి ఖురాన్ పఠనం సాగిస్తారని తెలిపారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రంజాన్ మాసం చివరి 10 రోజులు తాకరాత్ అంటారని పేర్కొన్నారు. ఆ రాత్రుల్లో ఖురాన్ ఆవిర్భవించిందని చెప్పారు. కళాశాల సెక్రటరీ జవ్వాద్ మాట్లాడుతూ జకాత్, ఫిత్ర పేదవారికి అందించి వారి కుటుంబంలో ఆనందాలనే వెలిగిస్తారని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ఉండే ఉపవాసాలు సైంటిఫిక్‌గా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఇడి సల్మాన్ ముర్తజీ, ప్రిన్సిపల్ డాక్టర్ శైలరేఖ, డాక్టర్ ఓబులేసు, డైరెక్టర్ డాక్టర్ జయమామిరెడ్డి, వైద్యులు, 2019 బ్యాచ్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


ఇఫ్తార్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

యువజనోత్సవాల విజేతలు వైవీయూ విద్యార్థులు

కడప అర్బన్ : జాతీయ స్థాయి యువజనోత్సవాలలో విజేతలుగా నిలిచిన యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థులను విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. వైవీయూ లలిత కళలు విభాగం విద్యార్థులు ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన దక్షిణ భారత దేశ యువజనోత్సవాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచిన జాతీయ స్థాయికి అర్హత సాధించారు. లూదియాన, పంజాబ్ అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవాలలో పోటీపడ్డారు. దాదాపుగా 108 విశ్వవిద్యాలయాలు పోటీపడగా వారిలో వైవీయూ విద్యార్థులు వై. అరవింద్ (కార్టూన్ విభాగంలో ద్వితీయ స్థానం), డి.రమాజ్యోతి(రంగోలి విభాగంలోతృతీయ స్థానం), దేవదాసు (పోస్టర్ మేకింగ్ విభాగంలో తృతీయ స్థానం), కె. శ్రీలత (మెహందీ ఆర్ట్స్ విభాగంలో తృతీయ స్థానం) విజేతలుగా నిలిచారు. విజేతలంతా విశ్వవిద్యాలయానికి చేరుకుని యూనివర్శి టీ కల్చరల్ కో– ఆర్డినేటర్ ఆచార్య విజయభారతి, లలితకళల శాఖ విభాగాధిపతి డా. కె. మృత్యుంజయరావు, బృందానికి నేతృత్వం వహించిన ఆచార్య పుత్తా పద్మ, జి.కాత్యాయని ఆధ్వర్యంలో విసి ఆచార్య చింతా సుధాకర్‌ను విశ్వవిద్యాలయాలోని ఆయన ఛాంబరులో కలిశారు. యువజనో త్సవాలలో రాణించిన తీరును ఆచార్య పద్మ వివరించారు. ఈ సందర్భంగా విసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథ రెడ్డి, లలితకళల శాఖ విభాగాధిపతి కోట మృత్యుంజయరావు, సి హెచ్ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమార్కులు!

ప్రజా'దృష్టి'

ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. జిల్లా జీవనాడైన పెన్నా నదిలో నీటి వనరుల జాడ తగ్గడం ఇసుకాసురులకు వరంగా మారింది. ఫలితంగా పర్యావరణ అనుమతులు లేని ఇసుక క్వారీల నుంచి సైతం ఇసుక అక్రమ రవాణా సాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాకు ఎదురు లేకుండా పోయింది. వేసవి సీజన్ కావడంతో భవన నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇసుక అక్రమ రవాణాకు హద్దు లేకుండా పోయింది. నాలుగేళ్లుగా ఇసుక అక్రమ రవాణాకు హద్దు లేకుండా పోతోంది. తాజాగా మరోసారి వేసవి సీజన్ రావడం, పెన్నానదిలో నీటి వనరులు అడుగంటిన నేపథ్యంలో ఇసుకాసురులు దోపిడీకి లాకులెత్తారు. మూడేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ కట్టకొట్టుకుపోవడానికి ఇసుక మాఫియాయే కారణమనే ఆరోపణలు ఉవ్వెత్తిన ఎగిసిన సంగతి తెలిసిందే. తాజాగా సిద్ధవటం మండలంలోని కమ్మపాలెంలో నిల్వ చేసిన ఇసుక డంప్ నుంచి భారీగా తరలిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒంటిమిట్ట పెన్నా తీరం నుంచి జంగాలపల్లి మీదుగా ఇసుక తరలిస్తుండడంపై గ్రామీణులు నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇదేతరహాలో ప్రతి ఏటా ఇసుక అక్రమ రవాణా సాగిపోతోంది. ఇసుక క్వారీల్లో సైతం ప్రభుత్వం నిర్దేశిత పారామీటర్ల ప్రకారం ఇసుకను తవ్వాల్సి ఉండగా, ఇష్టానుసారంగా జెసిబిల సహాయంతో తవ్వుకోవడం కనిపిస్తోంది. దీనిపై మైనింగ్ అధికారులను ఆరా తీస్తే నీళ్లు నములు తుండడం గమనార్హం. అక్రమ రవాణాను ఆపడానికి సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేని దుస్థితికి జారి పోవడం ఆందోళనకరం. అక్రమార్కుల స్వార్థానికి భవిష్యత్ తరాలను బలిపెట్టడం శ్రేయస్కరం కాదని పలువురు మేధావులు, రిటైర్డ్ జడ్జిలు మొదలుకుని ఇంటలెక్షువల్స్ వాపోతున్నప్పటికీ పాలకుల్లో చలనం లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇసుక అక్రమ రవాణా విషయంలో పాలక, ప్రతిపక్ష పార్టీల నాయకులు కుమ్మక్కై ప్రకృతి సంపదను ఇష్టానుసారగా దోచుకోవడం హేయనీయం. అక్రమార్కులు చెన్నయ్, బెంగళూరు నగరాలకు ఇసుకను తరలిస్తున్నారు. మెట్రోపాలిటన్ నగరాల్లో పెద్దపెద్ద డంప్‌లను ఏర్పాటు చేసి, ఒక్కో టిప్పర్‌ను సుమారు రూ.50 వేల చొప్పున బహిరంగంగానే విక్రయాలు సాగించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతిరోజూ రాత్రివేళల్లో వందలాది టిప్పర్లలో చెన్నయ్, బెంగళూరుతోపాటు సరిహద్దు జిల్లాలైన కర్నూలు, అనంతపురం పట్టణాలకు ఇసుకను తరలిస్తూ కోట్లాది రూపాయల్ని దోచుకుంటున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా బంగారంతో సమానమైన ఇసుక వనరుల్ని పద్ధతి ప్రకారం ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

షర్మిల ఆత్మపరిశీలన చేసుకోవాలి : డిప్యూటీ సిఎం

కడప : పిసిసి అధ్యక్షులు షర్మిల ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకాశాన ఉమ్మి వేస్తే ఆది తిరిగివచ్చి మన ముఖాన పడుతోందన్న వాస్తవాన్ని గ్రహించాలని అన్నారు. ఈ విషయంలో షర్మిల ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇష్టానుసారంగా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డిపై ఆరోపణలను ప్రజలు హర్షించరని పేర్కొన్నారు. కడపలో మాసాపేట, దేవునికడప, ఆప్సరా సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఐటిఐ సర్కిల్లో జనం లేక అసలు మాట్లాడకుండానే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది అన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సౌమ్యుడు, నిగర్వి, స్నేహశీలి అని జిల్లాలో ఎవర్ని అడిగినా అదే చెబుతారని, అలాంటి వ్యక్తిపై ఇష్టానుసారం అభాండాలు వేయడం షర్మిలకు తగదన్నారు. రాజన్న బిడ్డగా, జగనన్న చెల్లిగా ఆదరించి నెత్తిన పెట్టుకున్న జిల్లా ప్రజలు ఆమె ప్రవర్తన వల్ల తిరగబడే రోజు దగ్గరలోనే ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కడపు మంట, అసూయ తగ్గించుకుని ప్రజాభిప్రాయానికి అనుగుణంగా అడుగులు వేస్తే కనీస గౌరవమైనా దక్కుతోంది అని చెప్పారు. సమావేశంలో వైసిపి నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, సుభాన్ బాషా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహోరీ
ఆదివారం (సా)	సోమవారం (ఉ)
6.31	4.52

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

పట్టణంలో వీధి కుక్కల సంచారం ఎక్కువైంది.గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. వీటిని చూసి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న వారిని వెంబడిస్తున్నాయి. ఈ భయంతో వారు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటవల ముస్లిం కాలనీ, బిసి కాలనీలో కుక్కల బెడద ఉందని స్థానికులు వాపోతున్నారు. శుక్ర వారం ముస్లిం కాలనీలో ఉజైజ అనే చిన్నారిపై డాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇలాంటి ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు


వేలంపాట నిర్వహిస్తున్న దేవస్థాన అధికారులు

తలనీలాల ఆదాయం రూ.11 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండి వీరాంజనేయ క్షేత్రంలో భక్తులు తలనీలాలు, మొక్కుల ద్వారా రూ.11 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. నిల్వ ఉన్న తలనీలాలకు జరిగిన వేలం పాటలో రూ.11 లక్షలు, నిల్వ ఉన్న ఎండు కొబ్బరికి రూ.65,000 మొత్తం కలిపి రూ.11,65,000 ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్న ఈ వేలంపాటలో ఏలూరుకు చెందిన శ్రీ వేణు గోపాల్ తలనీలాలను దక్కించుకున్నారు. ఎండు కొబ్బరి వేలం పాటలో వేంపల్లికి చెందిన భాస్కరరెడ్డి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో చైర్మెన్ కావలి క్రిష్ణతేజ, ఆర్కె వ్యాలీ పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రాజీనామా పత్రాలను చూపుతున్న వాలంటీర్లు

14 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని నెలటూరు గ్రామానికి చెందిన 9 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. చింతకుంట సచివాలయ పరిధిలోని సంగటి తిమ్మాయపల్లెలో ముగ్గురు, నీలాపురం సచివాలయ పరిధిలో మరో ఇద్దరు వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను వాలంటీర్లు ఎంపిడిఒ సుగుణశ్రీకి అందజేశారు.

ప్రజాతీర్పు సమాజానికి మేలుచేసేలా ఉండాలి

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాబోవు ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమానికి ఓటేసి మద్దతివ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 13న ఎన్నికలు జరుగనున్నాయని, ప్రజాతీర్పు సమాజానికి మేలు చేసేలా ఉండాలన్నారు. అందుబాటులో ఉండే నాయకుడిని గెలిపించాలన్నారు. ఓటర్లు చైతన్య వంతులయ్యారన్నారు. విద్య, వైద్యం ,పిల్లల భవిష్యత్తుకు అధిక ప్రాధాన్యమిచ్చే వైసిపిని గెలిపించాలని ఆయన కోరారు. నాడు-నేడు పథకం కింద ప్రొద్దుటూరలో రూ.56కోట్లతో పాఠశాలలు ఆధునీకరించామన్నారు. పిల్లలకు ఆంగ్ల మాధ్యమంతోపాటు భోజనం, పుస్తకాలు, బట్టలు సమకూర్చామన్నారు. అమ్మఒడి పథకంలో తల్లుల ఖాతాలో రూ.15వేలు జమ చేశామన్నారు. ఫలితంగా అక్షరాస్యతా శాతం పెరిగిందన్నారు. 50వేల మంది పొదుపు సంఘాల మహిళలకు రూ.200కోట్లు ఇచ్చి మహిళా సాధికారితకు పెద్దపీట వేశామన్నారు. ఆరోగ్యశ్రీ మొత్తాన్ని రూ.5లక్షల నుండి రూ.25లక్షల వరకు పెంచామన్నారు. రైతన్నల సంక్షేమానికి ఆర్‌బికెలను ఏర్పాటు చేశామన్నారు. 2019 నుండి 2024 వరకు ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధికి దగ్గరైందన్నారు. 2004 నుండి 2009వరకు దివంగత నేత వైయస్ హయాంలో మినహా గత పాలకుల హయాంలో చెప్పుకోతగ్గ అభివృద్ధి జరగలేదని తెలిపారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి వైయస్ నిధులిస్తే ఖర్చుచేయలేక వెనక్కు పంపిన అసమర్థుడు వరదరాజులరెడ్డి అని ఆయన విమర్శించారు. మంచికి, మానవత్వానికి, సహృదయానికి ఓటేసి గెలిపించి ప్రజాసేవకు మరింత ఊతం ఇవ్వాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని చిన్న సింగనపల్లె గ్రామంలో వెలసిన పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రామ పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం పుట్టినప్పటి నుంచి ఉగాది పండుగకు ముందు వచ్చే శనివారం పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఇరగంరెడ్డి కుటుంబ సభ్యులు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఉన్నా గ్రామానికి విచ్చేస్తారు.


చిన్నసింగనపల్లెలోని పెద్దమ్మ తల్లి

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-నందలూరు

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌పి కృష్ణారావు, రాజంపేట డిఎస్‌పి చైతన్య ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి మండల పరిధిలోని ఈదరపల్లి గ్రామంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అందరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరిగిన కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అబ్దుల్‌జహీర్

కనీస వసతులకు నోచని జగనన్న కాలనీలు

ప్రజాశక్తి - చాపాడు

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి గృహ నిర్మాణాలు చేపట్టిన జగనన్న కాలనీల్లో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మండల వ్యాప్తంగా 656 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. చాలా గ్రామాలలో నివాసానికి అనువైన స్థలం కాక పోవడంతో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించడంలో లబ్ధిదారులు వెనక డుగు వేస్తూ వచ్చారు. నెర్రవాడలో 50 మంది వరకు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా, ఇందులో 20మంది మాత్రమే ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేశారు. చాపాడులో లోతట్టు ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో లబ్ధిదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఎన్ ఓబాయపల్లిలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు స్థల సేకరణ చేపట్టినప్పటికీ దారి సమస్య ఉండడంతో ఒక ఇంటి నిర్మాణం నోచుకోలేదు. కుచ్చుపాపలో కూడా లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. చియ్యపాడులో మాదిగ ఇనాం భూమి వంక సమీపంలో స్థలాలు కేటాయించడంతో ఇక్కడ కూడా నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మొర్రాయపల్లి, లక్ష్మీపేట గ్రామాల్లో మాత్రం కొంతమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. పల్లవోలు, మడూరులో అందరికీ అనువైన స్థలాన్ని మంజూరు చేయడంతో నిర్మాణాల్లో లబ్ధిదారులు ముందంజలో ఉన్నారు. జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసి నీటి వసతి కల్పించింది. ఈ కాలనీలు రోడ్లు, డ్రయినేజీ, వీధిలైట్లకు మాత్రం దూరంగా ఉన్నాయి. చాలా మంది లబ్ధిదారులు ఆర్థిక సమస్యలతో ప్రభుత్వం మంజూరు చేసే నిధులు తక్కువగా ఉండడంతో నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. దీంతో కాలనీలలో కొంతమంది ఇళ్లను నిర్మించుకోగా, మిగిలిన ప్రదేశాలు ఖాళీగా ఉండి కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తే ఇళ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునే అవకాశం ఉంటుంది.


అభివృద్ధికి నోచుకోని నెర్రవాడలో పేదలకు కేటాయించిన జగనన్న కాలనీ


ఆచార్ల కాలనీ ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి

మంచి చేశాం.. ఆదరించండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రతి ఇంటింటికి అందిన జగనన్న సంక్షేమ పథకాల వల్ల మంచి జరిగితేనే ఆదరించండని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కోరారు. గోపవరం పంచాయతీ హౌసింగ్ బోర్డులోని ఆచార్ల కాలనీలో శని వారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, సతీమణి రమాదేవి, యువనేత రాచమల్లు రాఘవేంద్రరెడ్డికి నాయకులు, కార్యకర్తలు, రాచమల్లు అభి మానులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం రాకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చేలా సంక్షేమ పథకాలు అందించారన్నారు. మీరు మాపై చూపి స్తున్న ఆదరణ అభిమానం మరువలేనిది అన్నారు. 2024 ఎన్నికల్లో ఎంపీ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని రాచమల్లు కోరారు. కార్యక్రమంలో 3వ వార్డు ఇంచార్జి శివరెడ్డి, వార్డు మెంబర్లు 12వ వార్డు రఘునాథ్‌రెడ్డి, 11 వ వార్డు గౌస్, 13వ వార్డు సంజయ్, శివారెడ్డి, కె రమణాచారి, బాషా, విశ్వరూప ఆచారి, వెంకటరమణ ఆచారి, సాయినాథ్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కన్వీనర్ నరసింహ ఆచారి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి వైసిపికి ఓటేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం ఉదయం స్థానిక చిన్న కొండప్ప కాలనీ, బేతాళ చర్చి, పెద్ద కొండప్ప కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు రూపొందించి, అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా భావించి దాని అమలుకు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెనకడుగు వేయలేదన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధిని సమపాలనలో నడిపిస్తున్న జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఎపి సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ హఫీజ్, సచివాలయ కన్వీనర్ చంద్రమౌళి, కో-ఆప్షన్ దాసరి చంద్రమౌళి, నాయకులు వీరారెడ్డి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో వైసిపి నాయకులు


దళితవాడలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డి

అరాచక పాలనకు చరమగీతం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో కొనసాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి కడప పార్లమెంటు అభ్యర్థి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక దళితవాడ, క్రిష్టియన్ కాలనీలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కడప అభ్యర్థి భూపేష్‌రెడ్డి, బిటెక్ తన యుడు రామిరెడ్డి, రవితేజారెడ్డి ప్రచారం చేశారు. కాలనీ ప్రజలు ఘన స్వాగ తం పలికారు. దళితవాడలో ఉన్న 10 కుటుంబాలు బాలయ్య, గంగన్న, మల్లి, చిన్న గంగన్న, నరసింహతోపాటు పలువురు టిడిపిలో చేరారు. వీరికి భూపేష్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థుల విజయాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ ద్వారా ప్రతి గడపకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జయరామిరెడ్డి, జయచంద్రారెడ్డి, నిమ్మకాయల మహ మ్మద్ దర్బార్, డివి సుబ్బారెడ్డి, రెడ్డి కిషోర్, జగన్నాథరెడ్డి, ఈశ్వరయ్య, తెలం గాణ వలి, ఆర్‌వి రమేష్, పూల అల్లాబకష్, మహమ్మద్, వేమకుమార్, డక్కా రమేష్, వీరభద్ర, జబీబుల్లా, వెంకటయ్య, బిజెపి జిల్లా అధ్యక్షుడు శశి భూషన్‌రెడ్డి, గాలి హరి, సుష్మా, మునగాల చంద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన 3వ వార్డు కౌన్సిలర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక 3వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్షుమ్మ, భర్త రామాంజనేయులు రెడ్డితోపాటు వంద కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరద రాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి సమక్షంలో చేరాయి. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ప్రొద్దుటూరును ఎమ్మెల్యే అవినీతిమయం చేశాడన్నారు. కష్టపడకుండా అవినీతితో డబ్బు ఎలా సంపాదించాలో ఎమ్మెల్యే దగ్గర నేర్చుకోవాలన్నారు. 5 దఫాలుగా తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అవినీతి అంట లేదన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా భూపేష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని వరద కోరారు. కార్యక్రమంలో యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వియస్ ముక్తి యార్, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి సానా విజయభాస్కర్‌రెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, కామిశెట్టి బాబు, బాదుబోయిన సుబ్బారావు, జనసేన నాయకులు సుంకర మురళి, జిలాని బాషా పాల్గొన్నారు.


కౌన్సిలర్‌ను టిడిపిలోకి ఆహ్వానించిన వరదరాజులరెడ్డి

అసంపూర్తి రోడ్డు పూర్తయ్యేదెన్నడో..!


వివి కొట్టాల వద్ద అసంపూర్తిగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వివి కోటాలు-వడియ రాజుపేట గ్రామాల మధ్యలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. త్వరగా పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. 11 ఏళ్ల క్రితం రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే వివి కొట్టాల్ వద్ద రహదారి నిర్మాణంలో సమస్య ఏర్పడడంతో మధ్యలో రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. మిగిలిన ప్రాంతాన్ని పూర్తిగా రోడ్డు వేశారు. కేవలం 50 మీటర్ల పొడవు మాత్రమే రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో వస్తే మరీ దారుణంగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మార్గాన వివి కొట్టాలు, వడియ రాజుపేట, సోమాపురం, శ్రీరామ్ నగర్, ఎస్సీ కాలనీ, సిద్ధారెడ్డిపల్లె, నాగాయపల్లి, మొర్రాయపల్లి గ్రామాల ప్రజలు మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపైకి రావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డును పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఓటింగ్ శాతాన్ని పెంచాలి : తహశీల్దార్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేట కూడలిలో శనివారం తహశీల్దార్ వెంకటనారాయణ , ఎంపిడిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఓటు హక్కు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఓటింగ్ శాతం పెంచాలని తెలిపారు. ఓటు హక్కు వినియోగం, విలువలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. భారత రాజ్యాంగం ప్రజలకు విలువైన ఆయుధాన్ని ఇచ్చిందని అదే ఓటు హక్కు అని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, వివిధ స్థాయిలలో జరిగే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా, నిజాయితీగా, ఓటు హక్కును ఉపయోగించు కోవాలని పేర్కొన్నారు. ఓటరు చైతన్యమే ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 85 సంవత్స రాలు పైబడి మంచం బాట పట్టిన ఓటరుకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం భారత ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, విఆర్ఒ సోమశేఖర్‌రెడ్డి, శీను, అంగన్వాడీ సూపర్వైజర్లు నిర్మల, జయలక్ష్మి, మణెమ్మ, సిబ్బంది శ్రీలక్ష్మి, వనజ కుమారి, వెలుగు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విలువైన ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని తహశీల్దార్ ఖాతిజున్ కుబ్రా అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, గాంధీబస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటును అమ్ముకోకుండా నిజాయితీగా ఓటు వేయాలన్నారు. ఓటును వజ్రాయుధంలా ఉపయోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు అండగా నిలవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గొడవల్లో ఇరుక్కోవద్దని ఎస్ఐ నాగేశ్వర రావు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎఒ హేమలత, జెఇ రామచంద్ర, ఆర్ఐ శశికళ, రెవెన్యూ సిబ్బంది సోహెల్, రాజశేఖర్, నాగార్జున, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది



చలివేంద్రం ప్రారంభించిన పోలీసులు

పోలీసుస్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశామని సిఐ దస్తగిరి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు శనివారం సిఐ, సిబ్బంది చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, ఎఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ యువకిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారి చిన్నారులచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ తదితర నృత్య ప్రదర్శనలు ఉందాయలన్నారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

ఒక్క అవకాశం కల్పిస్తే.. అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి - చాపాడు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ వైసిపి పాలనలో అరాచకం అధికమైందన్నారు. నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పందిటి మల్హోత్రా, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాచనూరు సుబ్బరాయుడు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, సుదర్శన్, నాయబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు


ప్రశంసాపత్రాలు అందిస్తున్న వైద్యులు వరలక్ష్మి, శ్రీదేవి

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న యువకులు శనివారం రక్తనిధిలో రక్తదానం చేశారు. దళితుల ఆశా జ్యోతి, స్వాతంత్ర్య సమరయోధులు, గొప్ప రాజకీయ వేత్త, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్ర పటానికి డాక్టర్ వైయస్ఆర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వైయస్ఆర్ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, పథాలజీ హెచ్ఒడి డాక్టర్ వరలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారి. అనంతరం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న 15 మంది యువకులు రక్తదానం చేశారు. వీరికి ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, హెచ్ఒడి డాక్టర్ వరలక్ష్మి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రక్తనిధి మెడికల్ అధికారి డాక్టర్ రేవతి, వైద్యులు, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల ఆర్ఒ వెంకటేశులు పేర్కొన్నారు. పులివెందులలోని 301 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. పులివెందులలోని మినీ సెక్రటేరియట్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విజిలెన్స్ టాస్క్ ఫోర్సు, ఫ్లయింగ్ స్క్వాడ్, ప్రత్యేక బృందాలు, చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.32 లక్షలు నగదు, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ప్రచారాల్లో పాల్గొన్న ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఆర్ఒ వెంకటేశులు

ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాబార్డ్ నిధులతో శనివారం ఎంఇఒ-2 నాగ తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛమైన ఆహారం, స్వచ్ఛమైన నీటిని తాగాలని ఉద్దేశంతో విద్యార్థులకు నాబార్డు నిధులతో ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిం చడం జరిగిందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలె త్తినా తమ దృష్టికి తీసుకుని వస్తే ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చడానికి కృషి చేస్తామని తెలిపారు. వేసవికాలంలో విద్యార్థులకు పాఠ శాలలో సరైన వసతులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పీడీ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఇఒ నాగ తిరుమలరావు